






# నేడు పటాన్ చెరులో సీఎం కేసీఆర్ పర్యటన

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
- సభాస్థలి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి హరీష్ రావు
- పటాన్ చెరుకి సంజీవిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

**పటాన్ చెరు-విశాలభారతి:** పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలకు సంజీవినిగా మారనున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా గురువారం ఉదయం 11 గంటలకు శంకుస్థాపన చేయబోతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో కలిసి మంత్రి హరీష్ రావు సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక, పార్కింగ్, తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గురువారం ఉదయం 10 గంటలకు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని, అనంతరం నాగులపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మేధా రైల్వే కోచ్ పరిశ్రమను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం పటాన్ చెరు పట్టణంలో 200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. నూతన ఆసుపత్రి ఏర్పాటుతో ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా చెందిన పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సీఎం కేసీఆర్ కార్యక్రమం విజయవంతం చేయాలని శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కెసిఆర్ రాక నియోజకవర్గ ప్రజలకు ఒక వరం లాంటిదని అన్నారు. ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గ ప్రజల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, తెలంగాణ చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్, టిఎస్ఎంఎస్ఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్పి రమణ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.



# ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం..

## బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్..




**హైదరాబాద్,విశాల భారతి:** వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఏ పార్టీతో పొత్తులు పెట్టుకోదని, ఒంటరిగానే పోటీ చేస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం బీఎస్పీ పార్టీ భువనగిరి జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ%--%కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు కుదిరే అవకాశముందని ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతున్న సమయంలో ఆయన కీలక ప్రకటన చేశారు.బీఎస్పీ-కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంటుందని వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు.రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమైనా బీఎస్పీ మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకురాలు దివంగత బెల్లి లలిత ఆశయ సాధనకు బీఎస్పీ నిరంతరం కృషిచేస్తుందని తెలిపారు.బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే యాదాద్రి జిల్లా పేరును బెల్లి లలిత భువనగిరి జిల్లాగా మారుస్తామన్నారు.ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. అమరుల ఆకాంక్షలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే దళితులు, మేధావులు, ఉద్యమకారులపై బిఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడుతూ, హత్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూముల కబ్జాలను దోపిడీ, దౌర్జన్యాలను అడ్డుకున్న రిటైర్డ్ ఎంపీడీవో టిఆర్ఎస్ నేతలు హత్య చేశారని ఆరోపించారు.నేరళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దళితులపై దాడులు చేశారని, అడ్వకేట్ వామన్ రావు దంపతులను కూడా పట్టపగలు హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు.కేసీఆర్ పాలనలో తెలంగాణలో నియంతృత్వం కొనసాగుతుందన్న ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై తీవ్ర నిర్బంధం విధిస్తూ అణిచివేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి,బీఆర్ఎస్ పార్టీలో రహస్య అజెండాతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.కేంద్రంలో పరిపాలన గాలికొదిలేసి మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్న బిజెపి పార్టీ, రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్న బిఆర్ఎస్ పార్టీలు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కేసీఆర్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు.రాబోయే ఎన్నికలలో ప్రజలందరూ బీఎస్పీ పార్టీకి అండగా ఉండాలని కోరారు.



# మహిళ పోలీస్ స్టేషన్ ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హెూం శాఖ మంత్రివర్యులు మహమూద్ అలీ

**ఉప్పల్ జూన్ 21 విశాల భారతి :** ఉప్పల్ లో మహిళ పోలీస్ స్టేషన్ ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హెూం శాఖ మంత్రివర్యులు మహమూద్ అలీ తెలంగాణ కార్మిక శాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి,రాచకొండ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. ఎస్ . చౌహాన్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ యొక్క కార్యక్రమంలో మల్కాజ్గిరి డిసిపి జానకి, ఏసీపి నరేష్ రెడ్డి, ఉప్పల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి, ఉప్పల్ నూతన ఇన్స్పెక్టర్ గా మంజుల, జి హెచ్ ఎం సి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, పన్నల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, పోలీస్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రైల్ కోచ్‌ల తయారీ..

## ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,200 మందికి లభించనున్న ఉపాధి

### వెయ్యి కోట్లతో రంగారెడ్డి జిల్లాలో ఫ్యాక్టరీని నిర్మించిన మేధా • నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీల్లో ఒకటైన ప్రారంభానికి సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లాలోని కొండగల్ వద్ద మేధా గ్రూపు నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రారంభించబోతున్నారు. రూ.1,000 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ ఫ్యాక్టరీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,200 మందికి ఉపాధి లభించనున్నది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామన్న హామీని కేంద్రం విస్మరించినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేసి తెలంగాణ గడ్డపై ప్రైవేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీని సాధ్యం చేసి చూపించింది. ప్రపంచ పరిశ్రమల, దిగ్గజ కంపెనీల అడ్డగా మారిన తెలంగాణ%౼%రైల్ కోచ్‌ల తయారీ, ఎగుమతులకు కేంద్రంగా నిలుస్తున్నది.

ఏపీ విభజన చట్టం ప్రకారం వరంగల్ జిల్లాలోని కాజీపేటలో రైల్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఆ తర్వాత మొండిచెయ్యి చూపింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఫ్యాక్టరీ కోసం రాష్ట్ర ప్రభుత్వం 60 ఎకరాల భూమిని కేటాయించడంతోపాటు రూ.40 కోట్ల నిధులను సమకూర్చినప్పటికీ



అతీగతీలేదు. 2016లో అప్పటి రైల్వే మంత్రి మనోజ్ సింగ్ తెలంగాణలో కోచ్ ఫ్యాక్టరీని స్థాపించే అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీంతో రంగంలోకి దిగిన తెలంగాణ సర్కార్ ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించింది. ఈక్రమంలోనే మేధా ఇక్కడ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఆ సంస్థకు అన్నిరకాలుగా సహయ సహకారాలు అందించిన తెలంగాణ ప్రభుత్వం అనతికాలంలోనే రైల్ కోచ్ ఫ్యాక్టరీని సాకారం చేసి చూపించింది.

**ప్రైవేట్‌లో అతిపెద్దది ఇదే..**

దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. ఇప్పటికే జర్మనీకి చెందిన సీమెన్స్ మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో సీఆర్ఆర్సీ ఇండియా ఫ్యాక్టరీని స్థాపించి మెట్రో రైళ్లకు రూపకల్పన చేస్తున్నది. ప్రస్తుతం కొండగల్‌లో ప్రారంభమవుతున్న ఫ్యాక్టరీ దేశంలో ప్రైవేటు రంగంలో ఏర్పాటైన కోచ్ ఫ్యాక్టరీల్లో మూడోదిగా నిలుస్తోంది. దేశీయంగా రైళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కేంద్ర సర్కార్ ప్రైవేట్ ఉత్పత్తి సంస్థలను ప్రోత్సహించింది. కేంద్రం ఐదు రైల్ కోచ్‌లు నిర్వహిస్తుండగా, ప్రైవేట్ సంస్థలు ముందుకొచ్చి మూడు ప్లాంట్లను ఏర్పాటు చేశాయి. కొండగల్ వద్ద 150 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ కోచ్ ఫ్యాక్టరీలో అన్ని రకాల రైల్వే కోచ్‌లు తయారుకానున్నాయి. ఏటా 500 కోచ్‌లు, 50 లోకోమోటవ్‌లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ యూనిట్‌కు ఉన్నది.

**ప్రారంభానికి ముందే రూ.600 కోట్ల ఆర్డర్**

- కొండగల్ రైల్ కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి ముందే రూ.600 కోట్ల ఆర్డర్‌ను పొందింది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఈ ఆర్డర్ వచ్చినట్లు మేధా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మోనో రైలు ప్రాజెక్టు విస్తరణలో భాగంగా 10 మోనో రైల్ రేక్స్ కోసం ఆర్డర్ ఇచ్చినట్లు వివరించారు. ఈ ఆర్డర్ విలువ రూ.600 కోట్ల వరకు ఉంటుందన్నారు.
- ఈ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు ఆగస్టు 2020లో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.
- టీఎస్ఐఐసీ ద్వారా భూములు కేటాయించి అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందించింది.
- మేధాకు భారత్‌తోపాటు అమెరికా, యూరప్, దక్షిణ అమెరికా తదితర దేశాల్లో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది.